# యువతా... అందుకో వరం!!



వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులు నిర్వహించే విభాగం

అంబేడ్కర్ విశ్వవిద్యాలయం(ఎచ్చెర్ల), న్యూస్‌టుడే

**జిల్లా విద్యార్థులకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల అందుబాటులోకి రానుంది. ఉన్నత విద్యను జిల్లాలోనే తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చేందుకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఇప్పటి వరకూ సంప్రదాయ పీజీ కోర్సులను మాత్రమే నిర్వహించేవారు. జిల్లా యువత ప్రభుత్వ కళాశాలల్లో ఇంజినీరింగ్ చదవాలంటే ఇతర జిల్లాలకు, ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఆ అవకాశం అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోనే దక్కనుంది. 2018-19 విద్యాసంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కోర్సులు ప్రారంభించేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.**

ఎచ్చెర్లలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ విద్యాసంవత్సరం నుంచి మూడు బ్రాంచ్‌లతో ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించేందుకు ఉపకులపతి ఆచార్య డా. కూన రామ్‌జీ చర్యలు చేపట్టారు. విశ్వవిద్యాలయం (మిగతా 15వ పేజీలో)

**తొలిసారి బీఆర్‌ఏయూలో ఇంజినీరింగ్ కోర్సులు**

**వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు**



అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

# యువతా... అందుకో వరం!!

(మొదటి పేజీ తరువాయి) ఏర్పాటైన పదేళ్ల తర్వాత కొత్తగా ఇంజినీరింగ్ కోర్సులను ప్రారంభిస్తుండటంతో జిల్లా విద్యార్థుల్లో ఆశలు రేగుతున్నాయి. తొలి ఏడాది సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌లను అందుబాటులోకి తేనున్నారు. ఒక్కో బ్రాంచ్‌లో 60 చొప్పున సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వం అందించే రూ. 35 వేలు ఫీజు రుసుముతోనే సీట్లు భర్తీ చేస్తారు. విద్యార్థి నుంచి రూపాయి కూడా అదనంగా వసూలు ఉండదు. పురుషులు, మహిళలకు వసతి గృహ సదుపాయం కూడా కల్పిస్తున్నారు.

## ప్రయోగాలకు అనుగుణంగా

జిల్లాలోని విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు ఆంధ్రావిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. వారి సిఫార్సుల మేరకు ఇక్కడ చర్యలు తీసుకున్నారు. రూ. 18 కోట్లతో నూతనంగా నిర్మించిన విద్యాప్రాంగణం (అకడమిక్ బ్లాక్)లో రెండు, మూడు అంతస్తుల్లో ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి తరగతులు, ప్రయోగశాలలు నిర్వహించనున్నారు. తొలి ఏడాది ప్రాథమిక అంశాలకు సంబంధించి ప్రయోగశాలలను... ప్రస్తుతం నిర్వహిస్తున్న పీజీ కోర్సుల ప్రయోగశాలల్లో నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. అదనంగా కొన్ని ప్రయోగ పరికరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు అవసరమయ్యే కంప్యూటర్ ప్రయోగశాలను సిద్ధం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో తొలి ఏడాదికి తగినంత మంది బోధనాసిబ్బందిని ఒప్పంద పద్ధతిలో నియమిస్తారు. భవిష్యత్తులో రెగ్యులర్‌గా నియమించనున్నారు.

## కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు

వర్సిటీలో ప్రారంభిస్తున్న ఇంజినీరింగ్ కోర్సుల్లో సీట్లను ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంసెట్-18 కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రైవేటు కళాశాలల్లో చదివే అర్హులైన వారికి ప్రభుత్వం బోధనా రుసుం (ఫీజు రీయంబర్స్‌మెంట్) అందిస్తున్నారు. ఆ వ్యయంతోనే నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు వర్సిటీ పాలకులు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాకు సంబంధించిన అర్హులైన విద్యార్థులు తొలుత అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో చేరేందుకు మొదటి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో వర్సిటీలోని ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు వెబ్ఆప్షన్స్‌లో ఇచ్చే కోడ్‌ను కూడా ప్రభుత్వం కేటాయించింది. వర్సిటీలో చేరాలంటే విద్యార్థి 'బీఆర్ఏయూ ఎస్ఎఫ్' అనే కోడ్‌తో బ్రాంచ్‌లకు ఐచ్ఛికాలు ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

**ఉపయోగాలు:** ● జిల్లాకు చెందిన నిరుపేద, మధ్యతరగతి ప్రతిభావంతులైన ఇతర జిల్లాలకు వెళ్లనవసరం లేకుండానే ఇక్కడ చదువుకోవచ్చు. దీని కొంత మేర వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. ● అన్ని సౌకర్యాలతో వసతిగృహ సదుపాయాలు కల్పిస్తున్నారు. ● భవిష్యత్తులో ఇంజినీరింగ్ విద్య జిల్లాలో బలోపేతం కానుంది.



## తగిన ప్రణాళికతో ముందుకు

వర్సిటీలో ఈ ఏడాది నుంచి ఇంజినీరింగ్ కోర్సులను ప్రారంభించేందుకు అన్ని చర్యలు పూర్తి చేశాం. తరగతులు ప్రారంభమయ్యేనాటికే మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. జిల్లా విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులు ప్రారంభించాం. తొలుత తాత్కాలికంగా ఒప్పంద పద్ధతిలో బోధకులను నియమిస్తాం. వచ్చే ఏడాదికి రెగ్యులర్ ఆచార్యులను నియమించేందుకు ప్రణాళికలు రూపొందించాం. భవిష్యత్తులో జిల్లా విద్యార్థులకు నాణ్యమైన ఇంజినీరింగ్ విద్య అందించేందుకు అవసరమయ్యే ప్రణాళికను తయారుచేశాం.

–డా. ఆచార్య కూన రామ్‌జీ, ఉపకులపతి, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం